# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఘనా ఆ దేశపు అత్యున్నత పురస్కారంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సత్కరించింది.
- ఉగ్రవాదంపై భారతదేశ వైఖరికి పాశ్చాత్య దేశాలు మద్దతు నివ్వాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు.
- దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి చట్ట సభల్లో కార్యకలాపాలు సజావుగా జరగాలని లోక్ సభ సభాపతి ఓం బిర్లా పేర్కొన్నారు.
- అమర్‌నాథ్ యాత్ర కాశ్మీర్ లో పలు మార్గాల ద్వారా సజావుగా కొనసాగుతోంది.

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనా పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షులు జాన్ డ్రామణి మహామాతో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. ఆఫ్రికన్ దేశమైన ఘనా అభివృద్ధి ప్రయాణంలో భారత్ ఒక భాగస్వామి అని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, డిజిటల్ టెక్నాలజీ, మౌలిక సదుపాయాలు మొదలగు అనేక రంగాలలో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు చర్చించారు. ఆయుర్వేదం సాంప్రదాయ వైద్య రంగాలలో నాలుగు అవగాహన ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. ఆ తరువాత ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఘనా జాతీయ గౌరవమైనటువంటి “ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా” పురస్కారంతో నరేంద్ర మోదీని జాన్ మహామా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో భాగంగా ఈరోజు రాత్రి ట్రినిడాడ్ అండ్ టొబాగో చేరుకుంటారు. ఆ దేశ అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా, ప్రధానమంత్రి కమ్లా పెర్సాద్ లతో నరేంద్ర మోదీ చర్చలు జరుపుతారు. ఆ తరువాత ట్రినిడాడ్ అండ్ టొబాగో పార్లమెంట్ సంయుక్త సమావేశంలో నరేంద్ర మోదీ ప్రసంగించనున్నారు. ప్రధానమంత్రి ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనపై ఆ దేశంలోని భారత హైకమీషనర్ ప్రదీప్ రాజాపురోహిత్ ఆకాశవాణితో

మాట్లాడుతూ... భారత్ ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాల మధ్య బలమైన సాంస్కృతిక సంబందాలతో పాటూ ఆర్థికపరంగా అపారమైన అవకాశాలు కూడా ఉన్నాయని వెల్లడించారు.

(వాయిస్ 30 సెకన్లు)

==============================

ఉగ్రవాదంపై భారతదేశ వైఖరికి పాశ్చాత్య దేశాలు మద్దతు నివ్వాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు వాషింగ్టన్ DC లో పాత్రికేయులతో మాట్లాడుతూ... ఉగ్రవాదంపై  పోరాటంలో ఐక్యమైన ప్రపంచ ప్రతిస్పందన అవసరమన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదంపై ఒకే వైఖరికి కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా జైశంకర్ వ్యాఖ్యానించారు.

==============================

అమర్‌నాథ్ యాత్ర దక్షిణ కాశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్, మధ్య కాశ్మీర్‌లోని గండేర్‌బాల్ జిల్లాలోని బాల్తాల్ జంట మార్గాల ద్వారా సజావుగా కొనసాగుతోంది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రెండు మార్గాల నుండి యాత్ర ఈరోజు తెల్లవారుజామున ప్రారంభమైంది. పహల్గామ్ మార్గంలో చందన్వారి వైపు 3 వేల మందికి పైగా భక్తులను అనుమతించారు. మరోవైపు బాల్తాల్ గండేర్బల్ బేస్ క్యాంప్ నుండి పవిత్ర గుహ మందిరం వైపు 9 వేల మందికి పైగా యాత్రికులను అనుమతించారు. జంట మార్గాల్లోని అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు, సురక్షితమైన వాతావరణంపై యాత్రికులు సంతృప్తిని వ్యక్తం చేశారు. 38 రోజుల యాత్రలో భాగంగా ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు కాశ్మీర్ ప్రాంతంలోని హిమాలయాలలోని 12 వేల 756 అడుగుల ఎత్తైన పవిత్ర గుహను దర్శించుకొనున్నారు. ఇదిలా ఉండగా 238 వాహనాల్లో 5 వేల మందికి పైగా మరో యాత్రికుల బృందం ఈరోజు ఉదయం జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుండి బయలుదేరింది.

విరామం

==============================

భారత తపాలా శాఖ పరివర్తనాత్మకమైన ప్రయాణంపై కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ఆకాశవాణి వార్తా విభాగం అందిస్తున్న ప్రత్యేక ఇంటర్వ్యూ ఈరోజు రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ప్రసారమవుతుంది. అన్ని ఆకాశవాణి కేంద్రాలతో పాటూ ఆకాశవాణి అధికారిక యూట్యూబ్ చానెల్ "ఆకాశవాణి ఎయిర్" లో కూడా ఈ ఇంటర్వ్యూ హిందీలో ప్రసారం కానుంది.

==============================

పార్లమెంటు వర్షాకాల సమావేశాలను ఈనెల 21 నుండి ఆగస్టు 21వ తేదీ వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృష్ట్యా ఆగస్టు 13, 14 తేదీలలో సమావేశాలు జరగవని ఆయన వెల్లడించారు.

==============================

హర్యానాలోని మనేసర్‌లో రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పట్టణ స్థానిక సంస్థల ఛైర్‌పర్సన్‌ల మొదటి జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ ను  లోక్‌సభ సభాపతి ఓం బిర్లా ఈరోజు ప్రారంభించారు. రాజ్యాంగ బలోపేతం దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర అనే ఇతివృత్తంతో ఈ సమావేశం రెండు రోజుల పాటూ జరగనుంది. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ... పట్టణ స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి బలమైన స్తంభాలలో ఒకటి అని,

వాటిని బలోపేతం చేయడం వల్ల ప్రజల అవసరాలు, ఆకాంక్షలు నెరవేరుతాయని అన్నారు. దేశంలోని ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి పార్లమెంటు నుండి పట్టణ స్థానిక సంస్థల వరకు చట్ట సభల్లో కార్యకలాపాలు సజావుగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఓం బిర్లా పేర్కొంటూ…

(వాయిస్ 31 సెకన్లు)

=============================

భారతదేశంపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారనే కారణంతో పాకిస్తాన్ కు చెందిన సినిమా నటులు క్రికెటర్ల సామాజిక మాధ్యమాల ఖాతాలను ప్రభుత్వం మరోసారి నిషేదించింది. ఈ సంవత్సరం మే లో, రెచ్చగొట్టే వ్యాఖ్యలను వ్యాప్తి చేసినందుకు గానూ ప్రభుత్వం అనేక పాకిస్తానీ యూట్యూబ్ ఛానెల్స్, సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసింది. వాటిలో నటులు సబా కమర్, అహద్ రజా మీర్, యుమ్నా జైదీ, డానిష్ తైమూర్ ల ఇన్స్టాగ్రామ్ అకౌంట్స్ క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, షోయబ్ అక్తర్ ల యూట్యూబ్ ఛానెల్స్ కూడా ఉన్నాయి.

=============================

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో "చార్ ధామ్ యాత్ర"కు అంతరాయం ఏర్పడింది. దీంతో నిన్న రాత్రి సోన్‌ప్రయాగ్ సమీపంలో 40 మందికి పైగా కేదార్‌నాథ్ యాత్రికులు చిక్కుకుపోయారు. అయితే వారిని SDRF సురక్షిత ప్రదేశాలకు తరలించింది. ప్రస్తుతం యాత్ర తాత్కాలికంగా నిలిపివేయబడింది. గౌరికుండ్, ఉమ్టా సమీపంలోని బద్రీనాథ్, భట్వారీ వద్ద గంగోత్రి, సిలై బ్యాండ్ వద్ద యమునోత్రి, ఓజ్రి బనాస్‌లకు రహదారులు మూసుకుపోయాయి. వీలైనంత త్వరగా అన్ని రహదాలులను పునరుద్ధరించడానికి ఆ రాష్ట్ర అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రాబోయే రెండు రోజులు ఆ ప్రాంతాలలో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని  వాతావరణ శాఖ అంచనా వేసింది.

=============================

దేశవ్యాప్తంగా గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 79 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరం తెలిపారు. "ధర్తి ఆభా జన భాగిదారి అభియాన్"లో భాగంగా గోవాలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 63 వేల గిరిజన గ్రామాలు ఉన్నాయని, వాటి సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడానికి వివిధ ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు.

=============================

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో భారత్ భారీ స్కోర్ దిశగా పయనిస్తుంది. టీ విరామ సమయానికి భారత్ 7 వికెట్లు నష్టపోయి 564 పరుగులు చేసింది. భారత కెప్టెన్ శుభమన్ గిల్ 265 పరుగులు చేసి అజేయంగా నిలిచారు.

=============================
=============================